పొంచి ఉన్న నీటి గండం

- గండికోటలో గణనీయంగా తగ్గిపోయిన నీటి నిల్వ
- నీటి కోసం ఎదురు చూస్తున్న ప్రజలు



తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి వద్ద ఏర్పాటు చేసిన జేసీ నాగిరెడ్డి తాగునీటి సంపు

తాడిపత్రి రూరల్: గండికోట ప్రాజెక్టులో అడుగంటిన నీటి నిల్వలతో తాడిపత్రి ప్రాంత వాసులకు నీటి గండం పొంచి ఉంది. గండికోట నీటిపై తాడిపత్రి మున్సిపాలిటీ, తాడిపత్రి మండలం, పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాలు ఆధార పడ్డాయి. గండికోట నుంచి రోజూ తాడిపత్రి మున్సిపాలిటీకి 1.20 కోట్ల లీటర్ల నీరు, మిగిలిన మండలాలకు 30 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లా గండికోట ప్రాజెక్టులో నెల రోజుల నుంచి నీటి నిల్వలు భారీగా తగ్గాయి. కేవలం 1.5 టీఎంసీ మాత్రమే ఉండటంతో నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని యర్రగుంట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో పాటు ఇతర వాటిని నీటి సరఫరాను నిలుపుదల చేయాలని తాడిపత్రికి చెందిన మున్సిపల్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌కు లెటర్ రాయాల్సి పరిస్థితి ఏర్పడింది. స్పందించిన కలెక్టర్ గండికోట నీటి నిల్వలను కేవలం నీటి అవసరాలను ఉపయోగించాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు.

ఎండిపోయిన పెన్నా, చిత్రావతి

వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలంలో శ్రీశైలం బ్యాక్ వాటర్, పెన్నానది, చిత్రావతి నదుల నీటి అధారంగా గండికోట ప్రాజెక్టును 2006లో 26.85 టీఎంసీల సామర్థ్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించారు. వర్షాభావం వల్ల పెన్నానది, చిత్రావతి నదులు పూర్తిగా ఎండిపోయాయి. ఆలస్యంగా శ్రీశైలం పరివాహక ప్రాంతంలో వర్షాలు పడటంతో గండికోటకు సరఫరా చేసే బ్యాక్ సరఫరాలో తీవ్ర జాప్యం ఏర్పడింది. ఈ ఏడాది గండికోటకు నీటి సరఫరా చేస్తారా లేదా అన్న సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం శ్రీశైలం బ్యాక్ వాటర్ అవుకు రిజర్వాయర్‌కు చేరుకుని అక్కడి నుంచి గండికోటకు సరఫరా అవుతోంది. ఏ మేరకు నీటి సరఫరా ఉంటుందోనని నియోజకవర్గ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గండికోటపై ఆధారపడ్డ జేసీ నాగిరెడ్డి ప్రాజెక్టు

గండికోట ప్రాజెక్టుపై జేసీ నాగిరెడ్డి తాగునీటి ప్రాజెక్టు అధాపడి ఉంది. వైఎస్సార్ జిల్లా బాలప్ప కోన వద్ద దాదాపు రూ. 508 కోట్ల వ్యయంతో జేసీ నాగిరెడ్డి ప్రాజెక్టును నిర్మించారు. బాలప్ప కోన వద్ద గ్రావెటీ ద్వారా రెండు పైపులైన్ల నుంచి వేర్వేరుగా నీటి సరఫనా చేస్తున్నారు. ఒక పైపులైన్ తాడిపత్రి మున్సిపాలిటీకి, మరో పైప్‌లైన్ ద్వారా తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాలకు గండికోట నీటి సరఫరా జరుగుతోంది. కానీ గండికోట ప్రాజెక్టులో తగ్గిన నీటి నిల్వలతో 15 రోజుల నుంచి నీటి సరఫరాలో జాప్యం జరుగుతోంది.

ప్రజల్లో ఆందోళన

గండికోట ప్రాజెక్టుపై తాడిపత్రి ప్రాంతంలోని మూడు లక్షలకుపైగా ప్రజలు ఆధారపడ్డారు. తాడిపత్రి పట్టణం, తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాలు పెన్నానది పరివాహన ప్రాంతంతో విస్తరించాయి. గతంలో నీటి అవసరాల కోసం పూర్తిగా పెన్నానదిపై అధారపడి బోర్లు వేసేవారు. యాడికి, పెద్దవడుగూరు మండలాలకు నీటి అవసరాలను అందించడానికి అధికారులు భూగర్భ జలాలపై ఆధారపడేవారు. వర్షాభావం వల్ల అడుగంటిన భూగర్భ జలాలతో ఇబ్బందులు పడేవారు. నీటి సమస్య తీర్చడానికి లక్షలు ఖర్చు చేసి నీటి ట్యాంకుల ద్వారా ప్రజలకు పంపిణీ చేసేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని గండికోట ప్రాజెక్టులో దాదాపు 24 టీఎంసీల వరకు నీటి నిల్వ చేయడంతో అధికారులతో పాటు ప్రజలు కూడా నీటి సమస్యకు తావులేకుండా పోయింది. ప్రభుత్వం మారడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనవడం తదితర కారణాలతో గండికోటలో అమాంత నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో భవిష్యత్ నీటి అవసరాలపై ప్రజల్లో భయాందోళన నెలకొంది.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



గండికోట ప్రాజెక్ట్‌లో తగ్గిన నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ ప్రజలకు నీటి ఎద్దడి కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. పెన్నానదిలో దాదాపు 20 బోర్ల నుంచి రోజూ మూడు లక్షల లీటర్ల నీటిని పంపింగ్ చేసుకుంటున్నాం. అవసరమైతే మరిన్ని బోర్లు వేస్తాం. గండికోట నుంచి 15 రోజులుగా అరకొరగా నీరు వస్తోంది. రెండు నుంచి మూడు గంటలు కూడా రావడం లేదు.

– మున్సిపల్ డీఈ, వెంకటసుబ్బయ్య

క్లుప్తంగా

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం



నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డాక్టర్ వినత ఆధ్వర్యంలో జాతీయ గ్రంథపాకుల దినోత్సవం ఘనం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి ఎంతో తోడ్పాటు అందిస్తాయన్నారు పద్మశ్రీ డాక్టర్ ఎస్‌ఆర్ రంగరాథన్ జయంతిని జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంగా జరుపుకోవడం విశేషమన్నారు. అనంతరం కళాశాలలో లైబ్రరీ లోగో డిజైన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఈఈఈ విభాగం అధిపతి డాక్టర్ మేరీమాత, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ వంశీక్రిష్ణ రెడ్డి, లైబ్రేరియన్ డాక్టర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

తాడిపత్రి రూరల్ : మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ సెక్షన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి రాముడు అంత్యక్రియల కోసం సోమవారం రూ.15 వేల చెక్‌ను కుటుంబ సభ్యులకు డీఈ సుబ్బయ్యతో కలిసి అందించామని సీఐటీయూ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గుండెపోటుతో అనంతపురంలో చికిత్సపొందుతూ రాముడు మృతి చెందడంతో కమిషనర్ ఆర్థిక సాయం అందించారన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



రాధాకృష్ణారెడ్డి (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణారెడ్డి(64) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి సోమవారం వేకువజామున స్వగృహంలో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఫోన్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఎయిడ్స్‌ను సమష్టిగా నిర్మూలిద్దాం



ర్యాలీ ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్ర

గుంతకల్లుటౌన్: అపరిచితులతో శృంగారం, రక్తమార్పిడి, కలుషిత సిరంజిలతో సోకే ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహ కలిగి ఉండాలని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అజేంద్ర సూచించారు. ప్రగతి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులపై వివక్ష వీడాలన్నారు. హెచ్ఐవీ, లైంగికంగా సంభవించే అంటువ్యాధుల సమాచారాన్ని అందించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు న్యాకో సంస్థ రెండు నెలల పాటు కార్యక్రమాల్ని కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత, ఐసీటీసీ, డీఎస్‌ఆర్‌సీ, పీపీటీసీ కౌన్సిలర్లు ప్రసాద్, పీరానాయక్, సుమలత, మైత్రి పీడీ నూర్జహాన్, మేనేజర్ రమేష్, రాధమ్మ, నజుమున్నీసా పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతురాలు లలిత

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన చెందిన లలిత(20)కు పాత కల్లూరుకు చెందిన మల్లికార్జునతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవారు. కొన్ని రోజులుగా లలితపై అనుమానం పెంచుకున్న మల్లికార్జున తరచూ ఆమెను వేధిస్తూ వచ్చేవాడు. పలుమార్లు లలిత తన పుట్టింటికి వెళ్లిపోయేది. అనంతరం పెద్దల పంచాయితీతో రాజీ పడి అత్తారింటికి చేరుకునేది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం కుటుంబ పెద్దలు రాజీ చేయడంతో అత్తారింటికి చేరుకున్న ఆమె సోమవారం మరోసారి భర్తతో గొడవ పడడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కాపాడి పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. లలిత మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమాలపై విచారణ చేయించండి



కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషికి వినతిపత్రాన్ని అందజేస్తున్న విజయలక్ష్మి

గుంతకల్లుటౌన్: ఎఫ్‌సీఐ గోదాముల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించడంతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థలో సమస్యలను పరిష్కరించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరా శాఖ మంత్రి ప్రహ్లాదజోషిని ఎఫ్‌సీఐ(ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కమిటీ రాష్ట్ర డైరెక్టర్ విజయలక్ష్మి కోరారు. సోమవారం హుబ్లీలోని మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎఫ్‌సీఐ నుంచి రేషన్‌షాపులు, ప్రభుత్వ హాస్టల్స్, మధ్యాహ్న భోజన పథకానికి బియ్యం తరలింపుల్లో జరుగుతున్న అవకతవకలు, ఇతర వ్యవహారాలపై జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దాలని కోరినట్లు ఆమె తెలియజేశారు. అలాగే ఎఫ్‌సీఐ కమిటీ చైర్మన్‌ను నియమించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

టీడీపీ మద్దతుదారులపై కేసు నమోదు

తాడిపత్రి రూరల్: పెన్నానది నుంచి అక్రమంగా తరలించిన ఇసుకను తోటలో డంప్ చేసి అక్కడి నుంచి తరలిస్తున్న టీడీపీ మద్దతుదారులకు చెందిన జేసీబీతో పాటు మూడు టిప్పర్లపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు జరిపారు. దాడుల్లో పట్టణ సమీపంలోని కొత్త బ్రిడ్జి వద్ద తోటలో డంప్ చేసిన ఇసుకతో పాటు లోడ్ చేస్తున్న జేసీబీ, టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొని విచారించగా తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులైన తలారి అశోక్, చిన్న ఓబులేసు, అశోక్‌కు చెందిన టిప్పర్లు, గన్నెవారిపల్లి సత్యమయ్యకు చెందిన జేసీబీగా తేలింది. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు

తాడిపత్రి మండలంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేశామని అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. తాడిపత్రి మండలం ఆలూరుకు చెందిన విజయకుమార్, కర్నూలు జిల్లా సంజామలకు చెందిన సూర్యనారాయణ పెన్నానది నుంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

దాసరి కులానికి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న దాసరి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి. రవి

గుత్తి: అన్ని రంగాల్లో వెనుకబడిన దాసరి కులానికి ప్రత్యేక రిజర్వేషన్ సదుపాయం కల్పించాలని దాసరి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి. రవి, తోలు బొమ్మలాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని దాసరి కాలనీలో ఉన్న గంగమ్మ గుడి వద్ద సోమవారం దాసరి సంఘం సభ్యులు, దాసరి కులస్తులు సమావేశం నిర్వహించారు. ఎంకే రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నామినేటెడ్ పదవుల్లో దాసరి కులస్తులకు అవకాశం కల్పించాలన్నారు. కులస్తులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాసరి సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు, జిల్లా, మండల స్థాయి నాయకులు సుంకన్న, నరసింహులు, శ్రీదేవి, తిరుపాలమ్మ, మహేష్, రాజశేఖర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లు: పట్టణ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, మాజీ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, మాజీ నాయకులు నాగేషు, తలారి సురేష్, రాష్ట్ర సమతి సభ్యురాలు సాయి స్వరూప తదితరులు హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం వందలాది మంది విద్యార్థుల ఆధ్వర్యంలో బీరప్ప గుడి సర్కిల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్, నాయకులు అఖిల్, శివమణి, రోహిత్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి

పామిడి: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత మెరుగుపరచడంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో శానిటేషన్‌పై మూడురోజుల పాటు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నిర్వహించే అవగాహన సదస్సు మొదటిరోజు కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ బీవీ శశికళ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈసందర్భంగా పారిశుధ్యం మెరుగు, ఫాగింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సమాఖ్య నాయకులు

గుంతకల్లు: రైల్వే స్టేషన్ మాస్టర్ల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని అఖిల భారత స్టేషన్ మాస్టర్ల సమాఖ్య గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయం వద్ద అఖిల భారత స్టేషన్ మాస్టర్ల సమాఖ్య నాయకులు ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ నైట్ డ్యూటీ అలెవెన్స్‌ను స్టేషన్ మాస్టర్లకు వర్తింప చేయాలన్నారు. అలాగే సేఫ్టీ అలెవెన్స్ కూడా అందజేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ల సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుత్తి డీజిల్‌షెడ్‌లో సోమవారం రైల్వే కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ, బ్రాంచ్ సెక్రటరీ రామాంజనేయులు, నాయకులు నరసింహ, దాదా ఖలందర్, కృష్ణానాయక్, రంగనాయకులు, త్యాగరాజు, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, జాన్సన్‌బాబు పాల్గొన్నారు.

సీనియర్ డీఈఈపై కేసు నమోదు చేయాలి



నాగమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుంతకల్లు: అధికారుల నిరంకుశ పాలన పరాకాష్టకు చేరుకుందని, రైల్వే ఉద్యోగిని మాల నాగమణి మృతే ఇందుకు నిదర్శనమని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఇఫ్రిమ్, జి.పాపరావు మండిపడ్డారు. అధికారి వేధింపుల తాళలేక డివిజన్ పరిధిలోని కదిరి రైల్వే సెక్షన్‌లోని టీఆర్‌డీ విభాగంలో జేఈగా పని చేస్తున్న మాల నాగమణి ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి కారణమైన సీనియర్ డీఈఈ (టీఆర్‌డీ) సురేంద్రరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ గుంతకల్లు డివిజన్ శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ... నాగమణి మృతికి మూమ్మటికి సీనియర్ డీఈఈ సురేంద్రరెడ్డి తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. బదిలీ విషయంలో ఆమెతో కఠినంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రైల్వే పరంగా బాధిత కుటుంబానికి అందే బెనిఫిట్స్‌ను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఆర్ఎం విజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కోశాధికారి కె.నాగేశ్వరరావు, గుంతకల్లు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సాయిబాబా, ఎం.మురళీకృష్ణ, డివిజన్ కోశాధికారి నాగరాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశులు, అడిషనల్ సెక్రటరీ జీఎస్ కిషోర్‌కుమార్, డివిజనల్ మాజీ అధ్యక్షుడు కృష్ణసాయి, నాయకులు జీవీ రమణ, వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు కేఎల్ స్వామిదాసు. శ్రీనివాసరాజు, రమేష్‌బాబు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ



గుత్తిలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

గుత్తి రూరల్/పుట్లూరు/యల్లనూరు/పెద్దవడుగూరు/బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్, కార్యదర్శుల పాత్రపై శిక్షణ ఇచ్చారు. గుత్తి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీరెడ్డి, శిక్షకుడు శ్రీధర్‌గౌడ్, ఉపాధి ఏపీఓ మద్దిలేటి శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల్లో సంపద సృష్టించేందుకు సర్పంచ్, కార్యదర్శులు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రోజూ తడి, పొడి చెత్త సేకరించాలన్నారు. చెత్త ద్వారా వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం వస్తుందన్నారు. అలాగే ప్రకటనలు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థల ద్వారా ఆదాయం ఎలా పొందాలి అనే వాటిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రమేష్, మహబూబ్‌బీ, చంద్ర, మస్తాన్, చిదంబరి, గోపాల్, రామలింగమయ్య, కార్యదర్శులు వెంకటేష్, ధనలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు. పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ అనంద్ ప్రసాద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. యల్లనూరులో ఎంపీడీఓ వీరరాజు, బుక్కాపురం పంచాయతీ కార్యదర్శి అబిబుల్లా, ఇన్‌చార్జి ఈఓఆర్డీ ఉమాదేవి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఈఓపీఆర్‌డీ నాగేశ్వరశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు. బుక్కరాయసముద్రంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ దామోదరమ్మ, సర్పంచులు పాల్గొన్నారు. గార్లదిన్నెలో ఎంపీడీఓ, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



ప్రభాకర్‌నాయక్, కుళ్లాయిస్వామి

పామిడి/పెద్దవడుగూరు/గార్లదిన్నె/తాడిపత్రి రూరల్: పామిడి ఎంపీడీఓగా డీ ప్రభాకర్‌నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే పెద్దవడుగూరు, గార్లదిన్నె, తాడిపత్రి ఎంపీడీఓలుగా కుళ్లాయిస్వామి, విజయభాస్కర్, రంగారావు బాధ్యతలు స్వీకరించారు. వీరంతా ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలలకు బదిలీపై వెళ్లారు ఎన్నికలు ముగియడంతో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంపీడీఓలుగా తిరిగి అదే మండలాలకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

మిడ్ పెన్నార్ డ్యాంలోకి తుంగభద్ర జలాలు



మిడ్ పెన్నార్ డ్యాంలో నీరు నిల్వ ఉన్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాంలోకి కర్ణాటక రాష్ట్రం తుంగభద్ర డ్యాం నుంచి నీరు వచ్చి చేరుతున్నట్లు హెచ్చెల్సీ ఏఈ సురేంద్ర తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్రడ్యాం లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. రెండు రోజుల నుంచి తుంగ భద్రడ్యాం నీరు మోపిడి వద్ద కాలువ ద్వారా రోజు 400 క్యూసెక్కులు నీరు చొప్పున మిడ్ పెన్నార్ డ్యాంలోకి చేరుతుందన్నారు.ప్రస్తుతం మిడ్ పెన్నార్ డ్యాంలో 0.3 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

13, 14న రైల్వే గేట్ మూత

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని పుట్లూరు రైల్వే గేట్‌ను 13, 14 తేదీల్లో మూసివేయనున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న గేట్లను మరమ్మతు చేయడానికి గేట్లను మూసివేయనున్నారు. తాడిపత్రి పట్టణ వైపు రాకపోకలు సాగించే వాహనాలను ఆటోనగర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమీక్ష

పామిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ చాంబర్‌లో సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో ఈనెల 16 వ తేదీ నుంచి 45 రోజుల పాటు నిర్వహించే రెవెన్యూ సదస్సులపై ఆయన సమీక్షించారు. రెవెన్యూ సదస్సులు ఎలా నిర్వర్తించాలన్న తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మురళీధర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

శింగనమల: వర్షాలు రాక ఇబ్బందులు పడుతున్నారని రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్‌కు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుంకన్న, జయరాముడు, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెరువులను నీటితో నింపాలి

పుట్లూరు: మండలంలోని సుబ్బరాయసాగర్‌కు నీటిని సరఫరా చేసి తాగు, సాగు నీటి అవసరాల కోసం వెంటనే పుట్లూరు మండలంలోని చెరువులను నింపాలని ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతుల సంఘం నాయకులు కోరారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘాల నాయకులు తహసీల్దార్ శేషారెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, సత్తార్, గోపాల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో అవస్థలు

గుంతకల్లు: పట్టణ జనాభాకు అనుగుణంగా రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో గుంతకల్లులో ట్రాఫిక్ సమస్య తీవ్రమైందని, ప్రత్యేక చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ మీడియా ఆర్గనైజేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం గుంతకల్లు డీఎస్పీ శివభాస్కరరెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అలంనవాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

శింగనమల: అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం సలకంచెర్వు గ్రామానికి చెందిన ఓబయ్య(36)తన తల్లిదండ్రులతో కలసి నివసిస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసే ఓబయ్య కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో తెలిసిన వారి వద్ద చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ

పామిడి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిర్వహిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హిందువులపై దాడి అమానుషమని, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు జోజోడే కుమార్, శ్రీనివాసరావు అన్నారు. ర్యాలీకి బీజేపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, నల్లప్ప, అంజి చౌహాన్ నాయక్ సంఘీభావం తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

యల్లనూరు: సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యుడు లోకేష్ అవగాహన కల్పించారు. సోమవారం పీహెచ్‌సీ ఆవరణంలో ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాన్నారు. ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జీఓ 117 రద్దు చేయాలి

యాడికి/యల్లనూరు/పామిడి/గార్లదిన్నె: రాష్ట్ర ప్రభుత్వ చేపట్టి ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమాన్ని ఉపసంహరించుకొని జీవో 117 ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్ కోరారు. సోమవారం ప్రభుత్వం చేస్తున్న ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియకు నిరసనగా బాయ్‌కాట్ చేశారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ కాశెప్పకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరులో ఎంఈఓ చంద్రశేఖర్‌కు ఉపాధ్యాయ సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. పామిడిలో ఉపాధ్యాయ సంఘం నేతలు ఎమ్మార్సీలో వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా గార్లదిన్నెలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ చంద్రనాయక్‌కు అందజేశారు.

వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పించండి

యల్లనూరు: రాజకీయ నాయకుల అనాలోచిత నిర్ణయాల వల్ల తాము హక్కులను కోల్పోయామని మండల వాల్మీకి సంఘం నేతలు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం తహసీల్దారు నాగరాజుకు వినతి పత్రం ఇచ్చారు. వాల్మీకి సంఘం నాయకుడు హనుమంతు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీల్లో ఉన్న మమ్మల్ని మైదాన, ఏజెన్సీ ప్రాంతం అంటూ విడదీసి బీసీల్లో చేర్చి అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు బొప్పేపల్లి ఓబులేసు, యూత్ విభాగం ఉపాధ్యక్షుడు మారుతీ ప్రసాద్, సభ్యులు రామాంజినేయులు,సుబ్బయ్య, ప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలంటూ ధర్నా

పామిడి: పామిడి పంచాయతీకి సంబంధించి ఉపాధి పథకం పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఎం నాయకుడు పీ అనిమిరెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కే రహీమ్, మండల కార్యదర్శి ఎస్ నాగరాజు, ఆయా అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.